ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com



RNI TGTEL/25/A5065


vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు






Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 137 మంగళవారం 05 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-



Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 137 Tuesday 05 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# పీఠం మనదే
# విగిలూ

- తమిళ రాజకీయాల్లో కొత్తశకం
- విజయ్ సునామీతో కదలిన 'ద్రవిడ' పార్టీల కూసాలు
- దశాబ్దాల ద్విపార్టీ రాజకీయాలకు ముగింపు పలికిన ఓటర్లు
- సినిమాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్
- గెలుపులో యువత, మహిళలు, డిజిటల్ క్యాడర్ కీలక పాత్ర
- క్లియర్ ఐడియాలజీ, క్లీన్ ఇమేజ్ అభ్యర్థులు ప్లస్ పాయింట్





**వార్త సంధ్య, చెన్నై, మే 04 :** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకం ప్రారంభమైంది. ఐదు దశాబ్దాలుగా డీఎంకేఅన్నాడీఎంకే మధ్యే తిరిగిన అధికారం, ఇప్పుడు కొత్త నాయకుడి చేతికి చేరింది. సినీ రంగంలో అపారమైన ప్రజాదరణ పొందిన దళపతి విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి ఎన్నికల్లోనే చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయానికి దారి తీసిన ప్రధాన కారణాలేంటి అనే అంశంపై ప్రత్యేక కథనం.మొదటిగా, తమిళనాటలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్విపార్టీ వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగింది. 1967 నుంచి రాష్ట్రంలో ప్రధానంగా డీఎంకే లేదా అన్నాడీఎంకే మాత్రమే అధికారంలో ఉండటం, అవినీతి ఆరోపణలు, కుటుంబ పాలన వంటి అంశాలు ఓటర్లలో విసుగును పెంచాయి. ఈ పరిస్థితుల్లో బలమైన మూడో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు టీవీకే ఆశాకిరణంగా కనిపించింది.విజయ్ వ్యక్తిగత నిర్ణయాలు కూడా పార్టీ విజయానికి కీలకంగా మారాయి. తన కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే కోట్లాది రూపాయల రెమ్యునరేషన్ వచ్చే సినిమాలను పూర్తిగా వదిలేయడం ఆయనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తున్నానని ఇచ్చిన సందేశం ఓటర్లను బలంగా ఆకట్టుకుంది. ఇక సిద్ధాంతపరంగా కూడా టీవీకే స్పష్టమైన దిశను చూపించింది. మత, కుల విభజనలకు దూరంగా ఉండే సెక్యులర్ భావజాలం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లింది. పెరియార్, కామరాజర్, అంబేద్కర్ ఆలోచనలను సమన్వయం చేస్తూ అన్ని వర్గాలను ఆకర్షించే ప్రయత్నం చేసింది.విజయ్‌కు ఉన్న భారీ ఫ్యాన్ బేస్ ఈ ఎన్నికల్లో ప్రధాన బలం అయింది. సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయ్ - మిగతా 2 లో

# ఇది ప్రజా విజయం




- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- బంగాల్, అసోం, పుదుచ్చేరి అభివృద్ధికి నాదీ హామీ
- టీవీకే, యూడీఎఫ్‌లకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు
- కేరళ, తమిళనాడుల్లో తమకు ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన మోదీ

**వార్త సంధ్య, ఢిల్లీ, మే 04 :** బంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ ఘనవిజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు. అలాగే కేరళలో గెలిచిన యూడీఎఫ్‌నకు, తమిళనాడులో ఘనవిజయం సాధించిన టీవీకే పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు."2026 బంగాల్ అసెంబ్లీ - మిగతా 2 లో

## యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం

- కేరళలో కాంగ్రెస్ గెలుపు.. తాను చేసిన ప్రచారాన్ని గుర్తుచేసుకుంటూ రేవంత్ రెడ్డి ట్వీట్
- తన ప్రచారం సందర్భంగా ప్రజలు ఎంతో అభిమానం చూపించారన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ, కేరళలు ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన రాష్ట్రాలని వ్యాఖ్య
- కాంగ్రెస్‌ను గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికారన్న సీఎం



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 04 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాను కేరళలో ప్రచారం చేసిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులు అంటూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, వేణుగోపాల్, దీపాదాస్ మున్షీలకు కూడా అభినందనలు తెలిపారు.తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎంతోమంది యూడీఎఫ్ మద్దతుదారులు, కేరళ ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపించారని గుర్తు చేసుకుని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధిని విశ్వసిస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా దశాబ్ద కాలం పాటు అన్యాయాన్ని ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికాయని అన్నారు.కేరళలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు - మిగతా 2 లో



## కేరళలో కాంగ్రెస్ కూటమి ఘన విజయం

- కేరళలో పదేళ్ల వామపక్ష పాలనకు ముగింపు
- కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి స్పష్టమైన మెజారిటీ
- దేశంలో కమ్యూనిస్టుల పాలనలో ఉన్న చివరి రాష్ట్రం కూడా పరాజయం
- కొన్ని కీలక స్థానాల్లో గెలిచి ఉనికి చాటుకున్న బీజేపీ

**వార్త సంధ్య, కేరళ , మే 04 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల వామపక్ష పాలనకు తెరపడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చారిత్రాత్మక విజయం సాధించింది. పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ - మిగతా 2 లో

## దొంగల ఆచూకీ చెబితే రూ.1 లక్ష



- కరీంనగర్ పీఎంజే జ్యువెలర్స్‌లో సాయుధ దోపిడీ
- సిబ్బందిపై కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- ఐదుగురు నిందితుల ఫోటోలను విడుదల చేసిన పోలీసులు
- దోపిడీ దొంగల ఆచూకీ తెలిపితే రూ.లక్ష బహుమతి
- సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ

2 లో

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఏపీ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా నిలపాలన్న సీఎం చంద్రబాబు
- పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి
- రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ
- పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్క్.. యువతకు ఉపాధి కల్పన




**వార్త సంధ్య, అమరావతి, మే 04 :** ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి - మిగతా 2 లో

## ఏపీలో మళ్లీ 'నక్ష' సర్వే

- ఇక ప్రతి ఇంటికి ప్రత్యేక ప్రాపర్టీ కార్డు
- నగరాలు, పట్టణాల్లోని ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేయనున్న ఏపీ ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ 'నక్ష' ప్రాజెక్టు కింద డ్రోన్ల సహాయంతో సర్వే పునఃప్రారంభం
- క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డు ద్వారా ఆస్తి వివరాలు, రిజిస్ట్రేషన్ సులభతరం
- బ్యాంకు రుణాలు పొందడం, మున్సిపల్ ప్రణాళికల రూపకల్పనకు ఈ కార్డులు కీలకం
- 2027 మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం




2 లో

# సంపాదకీయం

## అందమైన నివాసం



మనిషికి ఆకాశంలోకి ఎగరాలన్న కాంక్ష పుట్టించేది పక్షి కాదు, తారలు కూడా కాదు, చదమామ! కథలు వినాలన్న ఆసక్తి పుట్టించడంలో నానమ్మ పాత్ర ఎంతో చందమామదీ అంతే. చందమామే ఒక కథ. ఒక కవిత కూడా. ఒక అందమైన స్త్రీ ఎలాంటి కవితావేశాన్ని కలిగిస్తుందో, నిండు చందమామ అలాంటి భావావేశాన్ని పుట్టిస్తుంది. అందుకే చందమామను తన అక్షరాల్లోకి ఒడిసిపట్టని భావకవులు ఉండరు. అసలు ఏ కవికైనా తన తొలి కవితకు సరంజామా ఇవ్వగలిగేది చందమామ కాక ఇంకేమిటి? అది మనిషికి ఎంత దూరమో అంత దగ్గర. ఈ నట్టనడి ఎండల్లో చంద్రుడి తలంపే మనకు చల్లని గొడుగు. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని తిలక్ అన్నప్పుడు ఈ వాక్యానికి అందం అందమైన ఆడపిల్లల వల్లే రాలేదు; వాళ్లు వెన్నెల్లో ఆడుకోవడం వల్ల వచ్చింది. చంద్రుడిని తలుచుకుంటేనే ఒక నెమ్మది, ఒక ప్రశాంతత, ఒక రహస్యోద్వేగం. అని మనిషిని మెలకువలోంచి కలల్లోకి మేలుకొలిపే మార్మిక మంత్రదండం. ఒంటరి ప్రయాణీకుడికి చందమామే దారి దీపం. అనంత చీకటిమయ ఆకాశాన్ని సజీవ మూర్తిగా నిలబెట్టేది దానికి రెండో కన్నుగా ఉండే చందమామే. పౌర్ణమికి దినదిన ప్రవర్ధమా నమవుతూ, అమవసకు అంతా కోల్పోయినట్టవుతూ మనిషి జీవిత చక్రాన్ని ఇది గుర్తుచేస్తుంది. అన్ని మతాల్లోనూ, సంస్కృతుల్లోనూ చంద్రుడి చుట్టూ ముడివడి ఎన్నో పండుగలున్నాయి. అసలు శరదృతువులో పౌర్ణమిని చూడటమే ఒక పండుగ!చైనా భావకవితోద్యమానికి మార్గదర్శిగా చెప్పే లీ తైపో క్రీ.శ. 699705 ప్రాంతంలో జన్మించాడు. పదేళ్లకే కన్ఫ్యూసియస్ పుస్తకాలన్నీ చదివేశాడు. దేశమంతా తిరిగాడు. రాజప్రాసాదాల్లోనూ జీవించాడు, గుహల్లోనూ నిద్రించాడు. మద్యం, మగువ, కవిత్వం ఆయనకు ప్రాణాధారం. వెనుక సంచీలో పుస్తకాలు, అంగీ మడతలో గుప్తంగా పిడిబాకు, అరచేతిలో సిద్ధంగా కవిత ఇదీ ఆయన వేషం. ఒకరోజు తాగిన మత్తులో సరస్సులోని చంద్రుడి బింబాన్ని కౌగిలించుకోబోయి మరణించాడని చెబుతారు. ఎలాంటి భావకవి! ర్యోకన్ తైగు అనే జెన్ గురువు గుడిసెలోకి ఒక దొంగ వచ్చాడట. తన దుస్తులు సహా దొంగకు ఒలిచి ఇచ్చేశాడు గురువు. దొంగ వెళ్లిపోయిన తర్వాత, ఒంటి మీద నూలుపోగైనా లేకుండా నిండుగా వెలుగుతున్న చందమామను కిటికీలోంచి చూస్తూ కూర్చున్న గురువు, అంతటి అందమామను దొంగకు ఇవ్వలేకపోయినందుకు నొచ్చుకున్నాడట! దొంగలు మన దగ్గరినుంచి ఎత్తుకెళ్లలేనిది మన విద్య, వివేకాలనే కాదు, మనకున్న చందమామను కూడా! ఒక్క చంద్రుడుని నిండుగా ఆనందించగలిగే హృదయముంటే ఎన్ని పూటల భోజనానికి పడే ఆరాటం తప్పుతుంది! ఇటాలో కాల్వీనో కథా ప్రపంచంలోనైతే చందమామ మీదికి నిచ్చెన వేసుకుని ఒక్క గెంతులో ఎక్కెయొచ్చు. అక్కడి మీగడ చిక్కదనపు పాలను లోడుకోవచ్చు. దానికి చేయవలసిందల్లా పొక్కులుగట్టిన చందమామ ఉపరితలం మీదుండే పొలుసులను కొద్దిగా జరిపి అక్కడ గరిట పెట్టడమే!గ్రీకు ప్రకృతి దేవత మీదుగా నామకరణం చేసి, చంద్రుడి మీదకు 'నాసా' పంపిన వ్యోమనౌక ఆర్టెమిస్2 ఏప్రిల్ 111 వరకు తిరుగాడి భూమ్మీదకు తిరిగొచ్చింది. భూమి నుంచి అంతరిక్షంలోకి సుదూరం పయనించి గతంలోని 'అపోలో' రికార్డును ఇది బద్దలుకొట్టింది. అన్నట్టు అపోలో, ఆర్టెమిస్ గ్రీకు పురాణంలో కవల సోదరీమణులు. మొదలైనప్పటినుంచీ తిరిగొచ్చేదాకా 6,95,081 మైళ్లు ప్రయాణించిన ఆర్టెమిస్2 అంతరిక్షంలోకి సుదూరంగా వెళ్లే వ్యోమగాములకు అవసరమైన వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదోనని నిర్ధారించేందుకు ఉద్దేశించినది. వస్తూవస్తూ సాక్ష్యంగా కొన్ని ఫొటోలను తెచ్చింది. వాటిని చూస్తే, చంద్రుడి మీద వెన్నెల మీగడలు ఏమీ లేవని తెలియడం ఒకింత కాల్పనిక నిరాశ. ఇది మామూలు భూమిలానే ఉందని తెలియడం ఒక వాస్తవం. కానీ చంద్రుడిపై మనుషులు దీర్ఘకాలంగా నివసించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు కావడం సాంకేతిక సంభ్రమం.

# పీఠం మనదే బిగిలూ

**మొదటిపేజీ తరువాయి -** మక్కల్ ఇయక్కం క్రమంగా శక్తిమంతమైన రాజకీయ క్యాడర్‌గా మారింది. రక్తదాన శిబిరాలు, విద్యా సహాయం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. యువత మద్దతు టీవీకే విజయానికి కీలకం. మొదటిసారి ఓటు వేసిన యువత పెద్దఎత్తున విజయ్‌కు మద్దతు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు, విద్యా సంస్కరణలు, పారదర్శక పరీక్షా విధానం వంటి హామీలు వారికి ఆకర్షణీయంగా మారాయి. మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు కూడా సైలెంట్ ఓటును టీవీకే వైపు మళ్లించాయి.డిజిటల్ ప్రచారం కూడా పార్టీకి బలంగా పనిచేసింది. సోషల్ మీడియా వేదికల్లో విజయ్ అభిమానులు ముందుండి ప్రచారం నిర్వహించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టో ప్రజలకు చేరేలా చేశారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభావం చూపింది. విజయ్ వ్యక్తిత్వం కూడా ఓటర్లను ఆకట్టుకుంది. సాధారణ జీవనశైలి, ప్రజల్లోకి వెళ్లి మమేకం కావడం, అభిమానులతో దగ్గర సంబంధం పెట్టుకోవడం వంటి లక్షణాలు ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. అన్నాగా పిలిచే ఈ అనుబంధం ఓట్ల రూపంలో ప్రతిఫలించింది.అన్నాడీఎంకేలో విభజనలు, బలమైన నాయకత్వం లేకపోవడం కూడా టీవీకేకు కలిసి వచ్చింది. ఆ పార్టీ ఓటు బ్యాంక్‌లో పెద్ద భాగం విజయ్ వైపు మళ్లింది. అదే సమయంలో డీఎంకేపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత కూడా టీవీకేకు లాభించింది. మేనిఫెస్టో విషయంలో కూడా టీవీకే ప్రత్యేకత చూపించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానానికి బదులుగా, జిల్లాల వారీగా స్థానిక సమస్యలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రైతులు, మత్స్యకారులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యేక పరిష్కారాలు సూచించింది.అభ్యర్థుల ఎంపికలో కూడా టీవీకే వినూత్న నిర్ణయాలు తీసుకుంది. రాజకీయ నేపథ్యం లేని విద్యావంతులు, డాక్టర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలకు అవకాశాలు ఇచ్చింది. అవినీతి మచ్చలేని క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచారు. మొత్తానికి, ప్రజల్లో మార్పు కోరికను అర్థం చేసుకుని, సరైన సమయంలో బలమైన ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చిన టీవీకే ఈ విజయాన్ని సాధించింది. ఈ ప్రభంజనం కేవలం తమిళనాడు రాజకీయాలనే కాదు, భవిష్యత్తులో జాతీయ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది.

# ఇది ప్రజా విజయం

**మొదటిపేజీ తరువాయి -** ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ప్రజాశక్తి గెలిచింది. బీజేపీ సుపరిపాలన రాజకీయాలు విజయం సాధించాయి. బంగాల్‌లోని ప్రతి ఒక్కరికీ నేను తలవంచి నమస్కరిస్తున్నాను. మీరు బీజేపీకి అనుకూలంగా అద్భుతమైన తీర్పును ఇచ్చారు. అందుకే బంగాల్ ప్రజల కలలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి మా పార్టీ సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తుందని నేను హామీ ఇస్తున్నాను. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవాన్ని అందించే ప్రభుత్వాన్ని మేము అందిస్తాం. ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు చేసిన కృషి, పోరాటాలు లేకుంటే, ఇవాళ బంగాల్‌లో బీజేపీ సాధించిన ఈ రికార్డు సాధ్యమయ్యేది కాదు. వారందరికీ నేను సెల్యూట్ చేస్తున్నాను. ఎన్నో ఏళ్లుగా వారు క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసి, అన్ని రకాల ప్రతికూలతలను అధిగమించి మా అభివృద్ధి జెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వారే మా పార్టీ బలం."అసోంలో బీజేపీ వరుసగా మూడోసారి విజయం సాధించడంపై మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అసోం మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్‌ను ఆశీర్వదించిందని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు."అసోం విధానసభ ఎన్నికల్లో బీజేపీ-ఎన్‌డీఏ విజయం సాధించాయి. అభివృద్ధి, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే మా కూటమి నిబద్ధతకు లభించిన తిరుగులేని మద్దతుకు ఇది నిదర్శనం. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన అసోం సోదరసోదరీమణులకు నా ధన్యవాదాలు. రాష్ట్ర పరివర్తన కోసం మేము నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని నేను మీకు హామీ ఇస్తున్నాను. అసోం ప్రజల మధ్య అహర్నిశలు శ్రమించిన బీజేపీ-ఎన్‌డీఏ కార్యకర్తలందరినీ నేను అభినందిస్తున్నాను. గత దశాబ్ద కాలంలో పార్టీ, కూటమి ఎదిగిన తీరు అభినందనీయం. మా కార్యకర్తల కృషి వల్లనే మా అజెండా ప్రజల హృదయాలకు చేరుకుంది. "పుదుచ్చేరిలో ఎన్.రంగస్వామి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంపై మోదీ ఆనందం వ్యక్తం చేశారు."ఎన్.రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం పనితీరు, మా సుపరిపాలనను ప్రాతిపదికగా తీసుకొని పుదుచ్చేరి ప్రజలు ఎన్‌డీఏ కూటమికి మరోసారి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ ఆశీస్సులు సుపరిపాలనను మరింత పెంపొందించేందుకు మేము చేస్తున్న ప్రయత్నాలకు మరింత ఊపునిస్తాయి. పుదుచ్చేరిలోని మా ఎన్‌డీఏ కార్యకర్తల అసాధారణ కృషి పట్ల నేను ఎంతో గర్విస్తున్నాను. వారు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, మా దార్శనికతను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. దీని వల్లనే ప్రజలు మమ్మల్ని మరోసారి ఆశీర్వదించారుకేరళలో బీజేపీ-ఎన్‌డీఏ కూటమికి ఓటు వేసిన వారందరికీ మోదీ ధన్యవాదాలు తెలిపారు. "కేరళ పురోగతికి అవసరమైన అంశాలను మేము నిరంతరం లేవనెత్తుతూనే ఉంటాం. 'వికసిత కేరళం'ను సాకారం చేసేందుకు కష్టపడి పనిచేస్తాం. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి నా అభినందనలు. కేరళ ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు కేంద్రం ఎల్లప్పుడూ తన మద్దతును ఇస్తూనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. "తమిళ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో మేము ఎల్లప్పుడూ ముందుంటాం.అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన టీవీకే పార్టీకి నా అభినందనలు. తమిళనాడు పురోగతికి, అక్కడి ప్రజల శ్రేయస్సు కోసం కేంద్రం కృషి చేస్తుంది" అని మోదీ స్పష్టం చేశారు.

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

**మొదటిపేజీ తరువాయి -** సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు.పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు.సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాల న్నారు. 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాలు-పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించా లన్నారు.పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేరళలో కాంగ్రెస్ కూటమి ఘన విజయం



**మొదటిపేజీ తరువాయి -** (ఎల్డీఎఫ్) ప్రభుత్వంపై ప్రజలు స్పష్టమైన వ్యతిరేక తీర్పు ఇచ్చారు. ఈ ఫలితంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనలో ఉన్న చివరి రాష్ట్రం కూడా వారి చేజారినట్లయింది.మొత్తం 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ప్రభుత్వం ఏర్పాటుకు 71 సీట్లు అవసరం కాగా, యూడీఎఫ్ కూటమి 102 స్థానాలతో తిరుగులేని విజయం అందుకుంది. మరోవైపు, అధికార ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలతో సరిపెట్టుకుంది. ఎన్డీయే కూటమి 3 చోట్ల గెలిచి ఉనికిని చాటుకుంది. ఏప్రిల్ 9న ఎన్నికలు జరగగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలే ఎల్డీఎఫ్ ఓటమికి ప్రధాన కారణాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ విజయంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ.. ఎల్డీఎఫ్ ప్రభుత్వ అహంకారం, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు ఇదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ.. తాము ఊహించిన దానికంటే గొప్ప విజయం లభించిందని అన్నారు. ఫలితాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు యూడీఎఫ్ సన్నాహాలు చేస్తోంది.

# కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం




**మొదటిపేజీ తరువాయి -** మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

# ఏపీలో మళ్లీ 'నక్ష' సర్వే



**మొదటిపేజీ తరువాయి -** ఏపీలోని నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజల ఆస్తులకు పటిష్ఠమైన భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి కుటుంబానికి చెందిన ఇళ్లు, స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలతో కూడిన 'ప్రాపర్టీ కార్డు'లను జారీ చేయాలని నిశ్చయించింది. ఇందుకోసం గతంలో మధ్యలోనే నిలిచిపోయిన 'నక్ష' (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించనుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ సర్వేను పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.గ్రామాల్లో 'స్వామిత్వ' పథకం తరహాలోనే పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఆస్తులను ఆధునిక డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఉపయోగించి సర్వే చేయాలని కేంద్రం 2024లో 'నక్ష' ప్రాజెక్టును ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాలను ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాకినాడ, ఏలూరు, గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కుప్పం, అనంతపురం వంటి తొమ్మిది నగరాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ నగరాల్లో సర్వే ప్రక్రియ కొంతవరకు జరిగినా, రికార్డుల నమోదు, మ్యాపింగ్ వంటి కీలక పనులు పూర్తికాలేదు. దీంతో వాస్తవ గడువు ముగిసినప్పటికీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి ఆస్తి యజమానికి ఒక ప్రాపర్టీ కార్డు లభిస్తుంది. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలు (విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు) సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా పూర్తవుతాయి. అంతేకాకుండా, ఈ కార్డులను ప్రామాణికంగా చూపి బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు, మున్సిపల్ అధికారులకు తమ పరిధిలోని ఆస్తులపై స్పష్టమైన సమాచారం ఉండటంతో నగర ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సులభతరం అవుతుంది. త్వరలోనే ఈ సర్వే పునఃప్రారంభంపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రానుంది.

# దొంగల ఆచూకీ చెబితే రూ.1 లక్ష




**మొదటిపేజీ తరువాయి -** కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితుల ఫోటోలను పోలీసులు విడుదల చేయడంతో పాటు, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష నగదు బహుమతిని ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు.నిన్న ఉదయం కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో ఉన్న పీఎంజే జ్యువెలర్స్‌లోకి వినియోగదారుల రూపంలో ప్రవేశించిన ఐదుగురు సాయుధ దుండగులు, ఒక్కసారిగా సిబ్బందిపై తుపాకులతో కాల్పులకు తెగబడటంతో నలుగురు సిబ్బందికి గాయాలైన విషయం తెలిసిందే. అనంతరం దుండగులు భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దోపిడీని తీవ్రంగా పరిగణించిన పోలీసులు, నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు."ఈ ఫోటోలలో ఉన్న వ్యక్తులు కరీంనగర్ నగల దుకాణంలో జరిగిన దోపిడీలో పాల్గొన్నారని, వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సరైన సమాచారం అందించిన వారికి రూ.1 లక్ష బహుమతి ఇవ్వబడుతుంది" అని పోలీసులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కరపత్రాలను విడుదల చేశారు.నిందితులకు సంబంధించి ఏవైనా ఆధారాలు లభిస్తే కరీంనగర్ టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ (8712670762), ఏసీపీ (8712670711), లేదా ఎస్‌బీ కంట్రోల్ రూం (8712670713) నంబర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# 37వ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యేను కోరిన కార్పొరేటర్

30 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన డ్రైనేజీ వ్యవస్థ

ఇండ్ల మధ్య మురుగు కాలువతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 04 (వార్త సంధ్య) :** 37వ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లో గత 30 సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ఇండ్ల మధ్యగా ప్రవహిస్తున్న పెద్ద మురుగు కాలువ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని, దాని పునర్నిర్మాణం మరియు మరమ్మత్తులకు తక్షణమే నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా, డివిజన్‌లో రోడ్లు మరియు డ్రైనేజీ అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామాలయం అభివృద్ధి కోసం కొత్త కమిటీని ఏర్పాటు చేసి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి, అద్దె ఆదాయంతో దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లెల రవిచంద్ర పాల్గొని, డివిజన్‌లోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి పరిష్కారం కోసం సహకారం కోరారు.

# మద్యం సిండికేట్‌పై తుడుం దెబ్బ ఆగ్రహం

9 ఆదివాసి ప్రాంతాల్లో చట్ట విరుద్ధ మద్యం వ్యాపారం జరుగుతోందని ఆరోపణలు

9 పీసా చట్టం అమలు కావడం లేదని విమర్శలు

9 బెల్ట్ షాపులు మూసివేయాలని డిమాండ్

9 బాధ్యులపై కేసులు నమోదు చేయాలని హెచ్చరిక



**భద్రాద్రి జిల్లా బ్యూరో మే 04 (వార్త సంధ్య) :** భద్రాచలం నియోజకవర్గంలో మద్యం సిండికేట్ దందా చట్ట విరుద్ధంగా కొనసాగుతోందని ఆదివాసి హక్కుల పోరాట సమితి 'తుడుం దెబ్బ' నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి మాట్లాడుతూ, "సీతారాములు" అనే వ్యాపారస్తుడు సిండికేట్ రూపంలో ఆదివాసి ప్రాంతాల్లో మద్యం వ్యాపారం నిర్వహిస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. గుడి, బడి అనే తేడా లేకుండా కిరాణా దుకాణాల వద్ద కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీని వల్ల ఆదివాసి సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. పీసా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కొంతమంది బినామీల సహాయంతో ఈ వ్యాపారం కొనసాగుతోందని ఆయన విమర్శించారు. ఐటీడీఏ, ఆబ్కారి, రెవెన్యూ శాఖలు ఉన్నప్పటికీ ఆదివాసులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సిండికేట్ ఆధ్వర్యంలో నడుస్తున్న బెల్ట్ షాపులను మూసివేసి, వైన్ షాపులను ఆదివాసుల ఆధీనంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై కూడా కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే, సమస్య పరిష్కారం అయ్యే వరకు ఐదవ షెడ్యూల్ కింద న్యాయపోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## కామారెడ్డి పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పాత బస్టాండ్ వద్ద కాలిపోయిన పూల, పండ్ల దుకాణాలను నేడు కౌన్సిలర్ల బృందంతో పరిశీలించి , వ్యాపారస్థులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చిన కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 4 (వార్త సంధ్య ) :** ఈ సందర్భంగా ఆయన వ్యాపారస్తులతో మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణాలు కాలిపోవడం దురదృష్టకరం , వ్యాపారస్థులు వ్యాపార సామాగ్రి మరియు దుకాణం నిర్మాణం మొత్తం నష్టపోయారని అన్నారు. అక్కడ ఉన్న 22 దుకాణ దారుల వివరాలు పూర్తి సమాచార ఇవ్వాలని, సాధ్యమంత తొందరగా ప్రభుత్వం తరుపున ఐరన్ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. అంత లోపు కాలిపోయిన వస్తువులను అన్నింటినీ తీసేసి స్థలం చదును చేయాలని సూచించారు. కాలిపోవడం ద్వారా నష్టపోయిన మొత్తం లో ప్రభుత్వం తరుపున రావాల్సిన పరిహారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

# విధులకు గైర్హాజరైన రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 04 (వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కె.చిరంజీవి విధులకు గైర్హాజరు కావడంతో పాటు, ఫోన్ కాల్స్‌కు స్పందించక పోవడం, వివరణ కోరుతూ జారీ చేసిన మెమో లను స్వీకరించకపోవడం గమనార్హమని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ నివేదిక అందడంతో, సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, శాఖాపరమైన విచారణ చేపట్టనున్న నేపథ్యంలో, ఎపి.సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం కె.చిరంజీవిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి అమల్లో ఉంటాయని,విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు.సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తులను నిరాకరించడం సరికాదు

-అన్ని రకాల దరఖాస్తులను తీసుకొని జవాబుదారీగా ఉండాలి

-ప్రతి దరఖాస్తును పరిశీలించి

అధికారులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

-వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్



**మంథని, మే 04(వార్త సంధ్య) :** మంథని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కొంతమంది దరఖాస్తు దారుల దరఖాస్తులను తీసుకోకుండా రెవెన్యూ అధికారులు నిరాకరించారని ఇది సరైన విధానం కాదని దీన్ని వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ అన్నారు. ఇంతకుముందు జిల్లా కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడేది దూర భారం సమయ భావం గ్రామీణ పేద ప్రజల వ్యయ ప్రయాసాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని నిర్ణయం తీసుకుందన్నారు. దానిలో భాగంగానే సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపాలని అంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మాసాలు ప్రజా భవన్ లో ప్రజా దర్బార్ పేరుతో దరఖాస్తులను స్వీకరించిందని అన్నారు.కానీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదు.ఈరోజు మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరు సరికాదని కార్యాల యానికి వచ్చే ప్రతి దరఖాస్తుదారు నుండి దరఖాస్తులను స్వీకరించి పరిష్కారం చూపాలే లేకుంటే వ్రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదేనని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రజావాణికి వచ్చే ప్రజల ప్రతి దరఖాస్తును స్వీకరించి పరిష్కారం చూపాలని లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 04( వార్త సంధ్య) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం బందారిగుంట గ్రామానికి చెందిన సుధాకర్ రవీందర్,శోభన్ తమకు గ్రామ శివారు సర్వేనెంబర్ 556 లోని ఎకరం 22 గుంటల భూమి ఉందని దీనిని కొందరు అక్రమంగా దొంగ పట్టా చేయించుకున్నారని దీనిని పరిశీలించి ఆ పట్టా రద్దు చేసి మా పేరును విరాసిత్ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డీ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన ఎం రాఘవరెడ్డి తనకు అన్నం పెట్టకుండా పోషణకు వేధిస్తున్న ఇద్దరు కుమారులు కోడలి పై చర్య తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన జి సుమలత తనకు జీవనోపాధి కింద ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో పంట నష్టం

రైతులను ఆదుకోవాలి : న్యూడెమోక్రసీ డిమాండ్

ఇల్లందు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 04 (వార్త సంధ్య) :** అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లందు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇటీవల కురిసిన అకాల వర్షాలు మరియు ఈదురుగాలులతో మామిడి పండ్లు నేలకూలిపోయాయని, మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలను అధికారులు తక్షణమే సర్వే చేసి, రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పొడుగు నరసింహారావు, నాయకులు కొక్కు సారంగపాణి, ఎండి. రాసుద్దీన్, పూనెం రంగన్న, మోకాళ్ల రమేష్, కల్తి వెంకటేశ్వర్లు, వాంకుడోత్ మోతిలాల్, బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, గుర్రం యాదగిరి, జరుపుల రమేష్, మంగీలాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బోయిని పేటలో నీటి వసతి కొరకు ప్రత్యేక చర్యలు

- మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్





**మంథని, మే 04(వార్త సంధ్య) :** వేసవి కాలము దృష్య నీటి యేద్దడి నివారణ చర్యల్లో భాగంగా సోమవారం మంథని పట్టణంలోని బోయిని పేటలో లక్ష్మి దేవర దేవాలయం వద్ద సింటెక్స్ వాటర్ ట్యాంక్ ప్రారంబోత్సవ కార్యక్రమాన్ని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో స్థానిక కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత నిర్వహించారు. తదుపరి మున్సిపల్ చైర్మన్ కి స్థానిక కౌన్సిలర్ శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఓడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ, వేసవి కాలములో ప్రజలకు నీటి కొరత లేకుండా నివారణ చర్యలు చెప్పట్టడం జరిగిందని,అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్క లబ్ధి దారునకి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నూకల కమల్, పెంటరి రాజు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో ఉపాధి హామీ రక్షణకై పోరాడుదాం



**మంథని, మే 04 (వార్త సంధ్య) :** మే డే వారోత్సవాల్లో భాగంగా సోమవారం మంథని మండలంలోని బెస్తపల్లి మరియు చిల్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల మధ్య మే డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా సీఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ.. రెండు పూటల ఫోటో విధానం వలన కూలీలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మండుటెండలో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. కూలీల బకాయిల వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు .పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన జిరాంజీ పథకం అమలు చేస్తే పేదవారికి పని దొరికే పరిస్థితి లేదని అన్నారు. మే డే స్ఫూర్తితో ఉపాధి హామీ రక్షణకై పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సేవలు మెరుగుపరచాలి..

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

-పిల్లల విభాగంలో ఓపీ, ఐపీ సేవలు బలోపేతం చేయాలి

ఈఎన్టీ వైద్యుడిని కాంట్రాక్ట్ పై నియమించి శస్త్రచికిత్సలు ప్రారంభించాలి

-అవసరమైతే అదనపు వైద్యులను నియమించాలి

అభివృద్ధి పనులు గడువుల్లో పూర్తి చేయాలి

-ఐడిఓసి కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 04 (వార్త సంధ్య) :** రామగుండం (గోదావరిఖని) జనరల్ ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో పిల్లల విభాగానికి సంబంధించిన ఓపీ,ఐపీ సేవలను బలోపేతం చేయాలని ఆదేశించారు.అవసరమైతే అదనంగా పీడియాట్రిక్ వైద్యులను నియమించుకోవాలని సూచించారు. ఈఎన్టీ వైద్యుడిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా పేర్కొన్నారు.ఆసుపత్రి అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డాక్టర్.కృపాబాయి,డాక్టర్. శిరిష,డాక్టర్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణంపై హైకోర్టు ఆదేశాలు అమలు కావడంలేదని ప్రజావాణిలో ఫిర్యాదు




**మంథని, మే 04(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని మార్కెట్ ప్రాంతం లో మున్సిపల్ లీజ్ భూమి ప్లాట్ నంబర్ 41లో ఎలాంటి అధికారిక అను మతులు లేకుండా కాంక్రీట్ స్లాబ్‌తో అక్రమ శాశ్వత భవనం నిర్మించారని స్థానిక నివాసి ఎండి.సుభానొద్దిన్ ఆరోపించారు. సోమవారం మంథని ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డీఏఓ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. వివరాల ప్రకారం..మంథని మార్కెట్ ఏరియాలో మున్సిపల్ లీజు భూమి ప్లాట్ నం 41 నిర్మాణం ప్రారంభమైన పునాదుల నిర్మాణ దశలోనే 2022 నవంబర్ 9న మంథని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు సమర్పించారు. ఇదే క్రమంలో భూమి లీజుదారులు హైకోర్టును ఆశ్రయించగా,తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రైట్ పిటిషన్ నం. 41930/2022లో కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ లీజ్ భూముల్లో శాశ్వత నిర్మాణాలకు అనుమతి లేదని,కాంక్రీట్ భవనాలు నిర్మించరాదని కోర్టు స్పష్టం చేసింది. అయినా కూడా నిర్మాణం కొనసాగుతూనే ఉండటంతో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల ప్రతీని జోడించి 2024 ఫిబ్రవరి 6న రెండోసారి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేసినట్లు సుభానొద్దిన్ తెలిపారు. మున్సిపల్ చట్టాల ప్రకారం లీజ్ భూమిలో గుడిసె లేదా తాత్కాలిక షెడ్ మాత్రమే నిర్మించుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని ఉల్లంఘిస్తూ ప్లాట్ నం 41 లో శాశ్వత నిర్మాణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు హైకోర్టు ఆదేశాలు అమలు కాలేదని,అధికారుల కాలయాపన,ఉదాసీనత కారణంగా అక్రమ నిర్మాణం మాత్రం ఆగలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని, మున్సిపల్ భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావాలని వినతి పత్రంలో కోరారు.

# కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బండి రమేష్




**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నూతన జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మయాంక్ సింగ్ ను సోమవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. తన కార్యాలయంలో ఉన్న కమిషనర్‌కు పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, మయాంక్ సింగ్ నాయకత్వంలో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. స్థానిక మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు రూ. 2.50 లక్షల ఎల్ఓసీ అందజేత



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గం, ప్రకాష్ నగర్ , శామ్ లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన రూప రాణి (52) వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 2,50,000 (రెండున్నర లక్షల రూపాయల) విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరైంది. ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రూప రాణి కుటుంబ సభ్యుడు విజయ్‌కు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఈ ఎల్ఓసీ లెటర్‌ను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే ప్రత్యేక చొరవ తీసుకున్న బండి రమేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ,రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాం భేష్..!

-ఇలాంటి సమ్మర్ కోచింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయి

-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 04 (వార్త సంధ్య) :** వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగించుకునేందుకు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్, టీ ఫైబర్, సూపర్ టీచర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం'ను సోమవారం ప్రారంభమైంది.గాంధీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలోని గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌ను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి లెర్నింగ్ ప్రోగ్రాం తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విద్యార్థులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్,ఏఐ, రోబోటిక్స్ పై ప్రాయోగిక జ్ఞానం పొందాలని సూచించారు. భవిష్యత్తులో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ వినియోగం,ఏఐ యొక్క దైనందిన జీవితంలో ఉపయోగాలు,సరళమైన రోబోటిక్స్ నమూనాల తయారీ, ప్రాజెక్ట్ ప్రదర్శనలు వంటి అంశాల్లో ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఏంఈఓ మల్లేశం,డీఆర్పీ ఎన్.రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రాంబాబు, స్వరూప్ చంద్, రమేష్, పీఆర్పీ శ్రీలత తో పాటు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీరామ్,రాహూల్ జువ్వాడి బృందం పాల్గొన్నారు.

# గ్రామీణ రవాణాకు కొత్త దారి

ఎమ్మెల్యే చేతుల మీదుగా బస్సు ప్రారంభం

గ్రామాలకు కనెక్టివిటీ బూస్ట్ రవాణా కష్టాలకు చెక్

బయ్యారం కేంద్రంగా ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం ప్రారంభం





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 04 (వార్త సంధ్య) :** పినపాక మండలం బయ్యారం గ్రామంలో పలు గ్రామాల ప్రజల రవాణా సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసును సోమవారం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఘనంగా ప్రారంభించారు. ఈ బస్సు సర్వీసు ద్వారా బయ్యారం, పాతరెడ్డిపాలెం, వెంకట్రావుపేట, చింతల బయ్యారం, జగ్గారం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రవాణా సౌకర్యాలు కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు సులభంగా ప్రయాణించేందుకు ఈ సర్వీసు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్,టీవీకే విజయం పట్ల లింగాల హర్షం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 4 :** తమిళనాడు , కేరళ ఎన్నికల్లో టీవీకే పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ హర్షం ప్రకటించారు తమిళనాడు ఎన్నికల్లో దళితుడైన విజయ్ దళపతి టీవీకే పార్టీని స్థాపించిన కొద్ది నెలల్లోనే అధికారాన్ని కైవసం చేసుకుని అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొని భారతదేశ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించడం అభినందనీయమని నూతన రాజకీయ సామాజిక శక్తులకు అంబేద్కర్ వాదులకు యువతకు స్ఫూర్తిదాయకమని రవికుమార్ అన్నారు తమిళనాడులో టీవీకే విజయ్ ప్రజలకు మంచి పాలన సామాజిక న్యాయం అందిస్తారని లింగాల రవికుమార్ ఆకాంక్షించారు

# మొగుదాల లక్ష్మమ్మకు పాల్వాయి స్రవంతి ఘన నివాళులు



**మునుగోడు,: మే -04(వార్త సంధ్య):** మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామంలో సోమవారం నాడు బిఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి పర్యటించి,గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు మొగుదల లక్ష్మమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి,వారి సేవలను స్మరించుకున్నారు.గ్రామంలో అందరితో ఆప్యాయంగా మెలిగిన లక్ష్మమ్మ మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా పార్టీకి మరియు గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు.అనంతరం లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను కలిసి వారిని పరామర్శించారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ,వారి బాధలో తాను భాగస్వామినని తెలిపారు.ప్రియమైన వారిని కోల్పోవడం ఎంతటి విషాదమో మాటల్లో చెప్పలేం.అయితే ధైర్యంగా ఉండాలి.లక్ష్మమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ కుటుంబంపై ఉంటాయి" అంటూ కుటుంబ సభ్యులకు ఓదార్పు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,కష్టసుఖాల్లో ప్రజలకు అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని, గ్రామ ప్రజలతో తన అనుబంధం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పేర్కొన్నారు. బాధలో ఉన్న కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా నాయకులు మారగోని అంజయ్య గౌడ్ , మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి వార్డ్ నెంబర్ చింతల లోకేష్ మేడి కరుణాకర్ మరియు,సీనియర్ నాయకులు మాధగోని రాములు,చింతల యాదయ్య అంజయ్య, చింతల బిక్షమయ్య మునుకుంట్ల భిక్షం, పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు లక్ష్మమ్మ గారికి ఘనంగా నివాళులర్పించారు.మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని గ్రామ ప్రజలు ప్రార్థించారు.

# నేల పరీక్షలతోనే లాభదాయకమైన సాగు సాధ్యం

శాస్త్రీయ సాగుతోనే అధిక దిగుబడి

రసాయనాల దుర్వినియోగానికి చెక్

మార్కెట్ డిమాండ్ పంటలలే సాగు చేయాలి

శాస్త్రం తోడైతేనే రైతు భవిష్యత్ బలంగా ఉంటుంది

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు







**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 04 (వార్త సంధ్య) :** నేల పరీక్షల ఆధారంగా సాగు చేస్తేనే రైతులకు లాభదాయకమైన వ్యవసాయం సాధ్యమవుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా చుంచుపల్లి మండలంలోని ఎస్‌సీబీ నగర్ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన "రైతు మహోత్సవం - రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో కలిసి భూమిలోని ఖనిజాలు, పీహెచ్ విలువలు, నేల స్వభావంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, మనిషికి రక్తపరీక్షలు ఎంత అవసరమో భూమికి నేల పరీక్షలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. భూమి స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటేనే రైతులకు కష్టానికి తగిన ఫలితం లభిస్తుందని పేర్కొన్నారు. సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, ముఖ్యంగా యూరియా వంటి రసాయనాల వినియోగాన్ని అవసరానికి మించి చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు.ు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, నీటి వినియోగాన్ని నియంత్రిస్తూ భవిష్యత్తు తరాలకు వనరులను సంరక్షించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తే ప్రకృతి సంరక్షణతో పాటు నాణ్యమైన ఆహారం ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆధునిక సాంకేతికతను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి భవిష్యత్తులో మరింత ప్రాధాన్యత పెరుగుతుందని, యువత కూడా ఈ రంగంపై ఆసక్తి పెంచుకుని దేశ ఆర్థిక వ్యవస్థకు బలం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గణేష్ చౌహాన్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు

# మునుగోడు మండల కుమ్మరి సంఘము అధ్యక్షులుగా ఖమ్మంపాటి భూపాల్ ఏకగ్రీవ ఎన్నిక



**మునుగోడు, :మే- 04(వార్త సంధ్య ):** మునుగోడు మండలం తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మునుగోడు నియోజకవర్గం కన్వీనర్ సిలివేరు సత్తయ్య అధ్యక్షతన వహించారు.మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.సభలో సంఘ భవిష్యత్ కార్యాచరణ, బలోపేతం, కుమ్మరి వృత్తిదారుల అభ్యున్నతి, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమర్థవంతమైన నాయకత్వం అవసరమని సభ్యులందరూ అభిప్రాయ పడగా, కమిటీ వేయడం జరిగింది మండల అధ్యక్షులుగా ఖమ్మంపాటి భూపాల్ తో పాటు ప్రధాన కార్యదర్శిగా సిలువేరు సత్యనారాయణ, కోశాధికారిగా నాంపల్లి కృష్ణ,గౌరవ అధ్యక్షులుగా బొడ్డుపల్లి సత్తయ్య, ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .సామాజిక సేవలో ముం దుండి పనిచేస్తున్న భూపాల్ ,కుమ్మరి కుల అభ్యున్నతి కోసం నిరం తరం కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ,కుమ్మరి కుటుంబాల సమస్యలను అధి.కారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు.భూపాల్ .మండలం లోని ప్రతి కుమ్మరి కుటుంబానికి సంఘం అండగా నిలిచేలా కృషి చేస్తానని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుం బానికి చేరేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సంప్రదాయ కుమ్మరి వృత్తికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు యువతను సంఘ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తానని తెలిపారు.ఈ ఎన్నిక పట్ల మండలంలోని కుమ్మరి సంఘ నాయకులు,గ్రామ కమిటీ సభ్యులు,యువత హర్షం వ్యక్తం చేస్తూ భూపాల్ కు మరియు మండల కమిటీ ఘన అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల కుమ్మరి సంఘం ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఈ ఏకగ్రీవ ఎన్నిక సంఘ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచిపోతుందని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం విద్యార్థి విభాగం అధ్యక్షులు ఖమ్మంపాటి సత్యనారాయణ నల్లగొండ జిల్లా కుమ్మరి సంఘం కన్వీనర్ రాధారపు బిక్షపతి,మీడియా విభాగం జిల్లా అధ్యక్షులు ఏరుకొండ నాగరాజు, మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ సిలువేరు సత్తయ్య , వివిధ గ్రామాల గ్రామ కమిటీలు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# రైతు వారోత్సవాల్లో భాగంగా రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాల పంపిణీ




**మునుగోడు: మే- 04(వార్త సంధ్య):** మునుగోడు మండలం పులిపలుపుల గ్రామ రైతు వేదికలో ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది.ఈ కార్యక్రమంలో రైతుల వ్యవసాయాభివృద్ధి,నేల సారాన్ని కాపాడటం, నాణ్యమైన పంటల ఉత్పత్తి లక్ష్యంగా భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొటీ నారాయణ ,గ్రామ సర్పంచ్ కంభంపాటి జ్యోతి వెంకటేశ్వర్లు రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి వ్యవసాయ పరిస్థితుల్లో ప్రతి రైతు తప్పనిసరిగా తన భూమికి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ద్వారా నేలలో ఉన్న పోషక పదార్థాల స్థాయిని తెలుసుకొని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించాలని కోరారు. ఇలా చేయడం వల్ల అనవసర ఎరువుల వినియోగం తగ్గి ఖర్చులు తగ్గడమే కాకుండా,అధిక దిగుబడితో పాటు నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని రైతులకు వివరించారు.వ్యవసాయ విస్తరణ అధికారి మాదగోని నరసింహ మాట్లాడుతూ,"నేలతల్లి ఆరోగ్యమే రైతు భవిష్యత్తుకు బలమైన పునాది" అని పేర్కొన్నారు. భూసారాన్ని పెంపొందించుకోవడానికి రైతులు పచ్చిరొట్టె ఎరువులు,హరిత ఎరువులు,పశువుల ఎరువులు వంటి సేంద్రియ వనరులను విస్తృతంగా వినియోగించాలని సూచించారు.అలాగే ప్రకృతి వ్యవసాయం,సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు దృష్టి మళ్లించి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ నేల సహజ సారాన్ని కాపాడాలని కోరారు.ఈ విధానాల ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా భావితరాలకు సారవంతమైన నేలను అందించగలమని అవగాహన కల్పించారు.ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని,వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం చేపడితే రసాయన ఎరువులపై అయ్యే అధిక వ్యయం తగ్గి, పంటల నాణ్యత పెరిగి,రైతుకు మంచి ఆదాయం లభిస్తుందని వివరించారు.రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి ఆధునిక వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తి ప్రొడ్యూసర్ చైర్మన్ జాజుల స్వామి , గ్రామ కార్యదర్శి రమేష్ ,గ్రామ రైతులు ఖమ్మంపాటి సహదేవుడు,సోమగోని రామస్వామి, కొంపల్లి అచ్చయ్య,బొలుగురి వెంకులు,వాలంటీర్లు అశోక్,రమేష్, లింగస్వామి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రైతు సంక్షేమం నేల సంరక్షణ సేంద్రియ వ్యవసాయం అనే లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం రైతుల్లో కొత్త అవగాహనను తీసుకువచ్చి వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# మే 6న మెగా జాబ్ మేళా నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి..

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

100 కంపెనీలు పాల్గొననున్న జాబ్ మేళా

వేదిక వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 04(వార్త సంధ్య) :** మే 6న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కోసం అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం డీసీపీ రామ్ రెడ్డి తో కలిసి జాబ్ మేళా వేదికగా ఏర్పాటు చేసిన వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌ను కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మే 6న జరిగే మెగా జాబ్ మేళా కార్యక్రమంలో సుమారు 100 కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్య లో యువత హాజరు కానున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. వేదిక వద్ద సరిపడా కుర్చీలు, తాగునీటి సదుపా యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థుల నమోదు కోసం అవసరమైన రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, తగిన సంఖ్యలో కంప్యూటర్ వ్యవస్థలను వేగవంతమైన ఇంటర్నెట్, వైఫై , సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్స్ ,అందు బాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగే ందుకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఉపాధి కల్పన అధికారి రాజశేఖర్, డి వై ఎస్ ఓ సురేష్, ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు , తదితరులు ,పాల్గొన్నారు.

# ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా

# కొరటికల్ రైతు వేదికలో రైతు వారోత్సవం ఘనంగా నిర్వహణ




**మునుగోడు,:మే- 04(వార్త సంధ్య):** మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామ రైతు వేదిక నందు రైతు వారోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు,నేల ఆరోగ్య పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం,సమతుల్య ఎరువుల వినియోగం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సరస్వతి పద్మజ మాట్లాడుతూ, రైతు భవిష్యత్తు నేల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. నేలలో పోషకాల సమతుల్యతను కాపాడుతూ,అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని ,సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తు లను వినియోగదారులకు అందించవచ్చని వివరించారు.మార్కెట్‌లో వినియోగదారులు అధికంగా కోరుకునే సన్న వరి రకాల సాగుపై రైతులు దృష్టి సారించి,నాణ్యమైన ఉత్పత్తులతో మంచి లాభాలు పొందాలని సూచించారు.ఉద్యానవన శాఖ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ,సంప్రదాయ పంటలతో పాటు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు,కూరగాయల సాగు ద్వారా తక్కువ కాలంలో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని రైతులకు వివరించారు. ఉద్యానవన పంటల సాగులో ఆధునిక సాంకేతికత,నీటి యాజమాన్యం,నాణ్యమైన విత్తనాల ఎంపిక వంటి అంశాల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన కొరటికల్ గ్రామ సర్పంచ్ అద్దంకి రామలింగయ్య మాట్లాడుతూ, రైతులే దేశానికి వెన్నెముక అని కొనియాడారు. రైతులందరూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి, సాగు ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులతో లాభాలు పొందాలని ఆకాం క్షించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న కార్య క్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందజేసి, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్డుల ద్వారా రైతులు తమ భూమి స్థితిగతులను అర్థం చేసుకొని, శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. పద్మజ ఉద్యానవన శాఖ అధికారి విద్యాసాగర్ , కొరటికల్ గ్రామ సర్పంచ్ అద్దంకి రామలింగయ్య , ఉప సర్పంచ్ మందుల అంజయ్య , దుబ్బకాల్వ ఉప సర్పంచ్ కంబాలపల్లి శంకర్ , వార్డు సభ్యులు దండు లింగస్వామి, బొల్లం యాదయ్య,మాదిరెడ్డి దేవకమ్మ, కొండ వెంకన్న, వ్యవసాయ విస్తరణ అధికారి తేలుకుంట్ల వెంకటేష్,గ్రామపంచాయతీ బొడ్డుపల్లి కార్యదర్శి శ్రీనివాస్,సాయిల్ హెల్త్ వాలంటీర్లు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా శాస్త్రీయ వ్యవసాయమే అభివృద్ధికి మార్గం అనే సందేశంతో నిర్వహించిన ఈ రైతు వారోత్సవం రైతుల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికింది.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# చిన్న కథ గొప్ప ప్రేమ

హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 04:



తల్లి నీ జన్మ ధన్యం
తల్లడిల్లెను నీ హృదయం
తనయుని ప్రాణముకై
తగవులాడితివి కాలముతో
తనువు చాలించిన గాని
తనయుని లాలించితివి
మరణమైనా పేగు బంధము
మాతృ బుట్టలో దాచుకొంటివి
తరములకు యుగములకు
నీ ప్రేమ తరిగిపోదు కరిగిపోదు
మానవ మనుగడ ఉన్నంతవరకు
మాతృ ప్రేమ మాసిపోదు
పితృభావనకే మూలం నీవు
ప్రకృతి ప్రసాదించిన వరము నీవు
పరిశుద్ధుని కరముల ఎముకవు నీవు
ప్రణుతించెను ప్రతి జననము
నీ పురిటి నొప్పుల ఫలమునకు!!

జొన్నలగడ్డ సారా పరవాసి

# పలివెల ఐకేపీ కేంద్రంలో రైతుల కన్నీటి గాధస్పందించి రైతు ధాన్యాన్ని కాపాడాలి



**మునుగోడు,:మే- 04(వార్త సంధ్య):** మునుగోడు మండలం పలివెల గ్రామంలోని ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి సందర్శించి,అక్కడ ధాన్యం అమ్మకానికి తీసుకొచ్చిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో నెలకొన్న పరిస్థితులను గమనించిన ఆమె,రైతులు పడుతున్న అవస్థలు చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు.ఈ సందర్భంగా రైతులు తమ గోడును ఆమెకు వివరించారు.పంటను ఎన్నో కష్టనష్టాలు పడి పండించి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చినప్పటికీ,రోజులు గడుస్తున్నా ధాన్యానికి కాంటా వేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.ఎండలో,రాత్రింబవళ్లు ధాన్యం కాపలా కాస్తూ కొనుగోలు కోసం ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం రైతు సంక్షేమం గురించి గొప్పలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతు కష్టాలు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తమైంది.అలాగే తరుగు పేరుతో జరుగుతున్న అదనపు తూకం రైతులకు మరింత భారంగా మారిందని రైతులు ఆరోపించారు. నిబంధనల ప్రకారం 40.700 కిలోలు మాత్రమే ఉండాల్సిన బస్తాకు, కొన్ని చోట్ల 42 కిలోల వరకు తూకం వేస్తూ రైతులను నిలువునా నష్టపరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ అక్రమాలను వెంటనే అరికట్టి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఆకాశం మేఘావృతమై వర్షం ముప్పు పొంచి ఉండటంతో రైతుల ఆందోళన మరింత పెరిగింది. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడిస్తే నాణ్యత దెబ్బతిని రైతు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని,అందువల్ల అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పాల్వాయి స్రవంతి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రైతు చెమట చుక్కతో పండించిన ప్రతి గింజకు విలువ దక్కాలి. రైతు కష్టాన్ని దోపిడీ చేసే విధానాలను బిఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో సహించదు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి వెంటనే చర్యలు తీసుకోవాలి.లేకపోతే రైతుల తరపున పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతాం" అని హెచ్చరించారు.రైతు కష్టమే రాష్ట్రానికి వెన్నెముక రైతు ధాన్యానికి గౌరవం దక్కే వరకు పోరాటం కొనసాగుతుంది అని పేర్కొంటూ రైతులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జెల బాలరాజు జిల్లా నాయకులు మారగోని అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ రెడ్డి,వార్డ్ మెంబెర్స్ నాతి రాము,స్వామి,బత్తుల శేఖర్,మార్తా మోహన్ రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# 3 9 అటెలియర్ ఇంటీరియర్ స్టూడియో ఘనంగా ప్రారంభోత్సవం

## వినియోగదారుల సంతృప్తి ప్రధాన లక్ష్యంగా పని చేయాలి-ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి






**ఎల్బీనగర్, మే 4 (వార్త సంధ్య):** ఎల్బీనగర్ నియోజకవర్గం చింతల్ కుంట రోడ్ మల్లికార్జున నగర్ జిసిఆర్ బిల్డింగ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 3 9 అటెలియర్ ఇంటీరియర్ స్టూడియో కి ఎల్బీ.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై నిర్వాహకులు మేరెడ్డి ఉదయ్ రెడ్డి, ఎం.ప్రసున రెడ్డి, వి.శివ కుమార్ రెడ్డి, కె.హర్షవర్ధన్ రెడ్డి, నందిని లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆధునిక డిజైన్,నూతన ఆలోచన, కస్టమర్ల అభి రుచికి అనుగుణంగా ఇంటీరియర్ సేవలను అందించేందుకు 3 9 అటెలియర్ ఇటీరియర్ స్టూడియో ముందుండాలని సూచించారు. నాణ్యత సమయపాలన వినియోగదారుల సంతృప్తి ప్రధాన లక్ష్యంగా యాజమాన్యం పనిచేయాలని తెలిపారు.అనంతరం యాజమాన్యం మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేకి ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఇంటిని అందంగా ఉపయోగకరంగా మార్చడం తమ లక్ష్యమని కస్టమర్ అవసరాలు అర్థం చేసుకొని బెస్ట్ డిజైన్ అందించేందుకు తాము నిరంతరం కట్టుబడి ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. గృహాలు, ఆఫీసులు, షోరూమ్స్ వంటి అన్ని రకాల ప్రాజెక్టులకు ప్రత్యేకమైన డిజైన్ సొల్యూషన్స్ సరసమైన ధరలకే అందిచబడతాయని ప్రజలు తమ ఇంటిని అందంగా తీర్చి దిద్దడం కొరకు తమను సంప్రదించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీ నగర్ కామినేని దగ్గర బి.జె.పి సంబరాలు



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 04:** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా బి.జె.పి మన్సూరాబాద్ ఆధ్వర్యంలో కామినేని క్రాస్ రోడ్స్ వద్ద ఈ విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించబడినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి.హెచ్.ఎం.సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా మోర్చా మరియు అన్ని మోర్చాల నాయకులు పాల్గొని టపాకాయలు పేల్చి స్వీట్లు పంచి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# విజయోత్సవ సంబరాలో పాల్గొన్నా బి.ఎన్.రెడ్డి నగర్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 04:** అస్సాం, వెస్ట్‌బెంగాల్, పుదుచ్చేరిలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా, ఎస్.కే.డి నగర్ చౌరస్తా,సాహెబ్ నగర్ చౌరస్తాలో ఘనంగా విజ యోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ సంబరాలలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రబారి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అస్సాం, వెస్ట్ బెంగాల్ పుదుచ్చేరిలో కాషాయ జెండా రెపరెపలాడిందని, బిజెపి అఖండ విజయం దేశ అభివృద్ధి మోదీ తోనే సాధ్యమని మరోసారి నిరూపితం చేయడం జరిగింది, రాబోయే కాలంలో తెలంగాణ గడ్డ పైన కూడా కాషాయ జెండా రెపరెపలాడుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రావు, రఘురాం నేత, శంకరయ్య గౌడ్, శేఖర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రేమ్ నాథ్, ప్రభాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్ గౌడ్, నారాయణ రావు,రవిశంకర్, శరత్ కుమార్, చిన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహిళ నాయకురాలు దేవిక, ప్రసన్న, సౌమ్య, నాయకులు పీసపాటి శ్రీనివాస్, చిత్రంజన్,కిషోర్, శ్రీనివాసరావు, ప్రభాకర్ యాదవ్, రామకృష్ణ, సుధీర్ కుమార్, రాజేందర్ రెడ్డి, కాంతారావు, రాజేందర్, శబరి, కామేష్, మణిపాల్ రెడ్డి, వెంకటేష్, సురేష్ కుమార్, వినీల్, దిలీప్ గౌడ్, నాగేష్, సిద్దేశ్వర్, యోగి యాదవ్, ప్రదీప్ గౌడ్, సాయి శంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పాక్సో కేసులో కారాగార శిక్ష



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 04:** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం. 65/2022, యు/ఎస్ 354 ఐపీసీ మరియు సెక్షన్ 11 & 12 పాక్సో చట్టం, ఎస్.సి నెం. 611/2022 కేసులో, గౌరవనీయ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి (రేప్ మరియు పాక్సో కేసుల త్వరిత విచారణ కోసం), రంగారెడ్డి జిల్లా, ఎల్.బి. నగర్ న్యాయస్థానం, సోమవారం నాడు తీర్పు వెలువరించారు.ఈ కేసులో నిందితుడు గుల్దాన్ సహాని, తండ్రి రాధేశ్యామ్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి పెయింటింగ్ పని, నివాసం గోపిటోలా టెలియా గ్రామం, పాక్డినౌని పోలీస్ స్టేషన్, మహారాజ్‌గంజ్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడు, దోషిగా తేల్చబడి 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ. 5,000/- జరిమానా విధించబడింది. అదేవిధంగా బాధితురాలికి రూ. 1,50,000/- పరిహారం మంజూరు చేయబడింది.ఈ విషయాన్ని హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.నాగరాజు గౌడ్ తెలియజేశారు.

# ప్రజావాణిలో 89 ఫిర్యాదులు స్వీకరణ - అధికారులకు తక్షణ పరిష్కార ఆదేశాలు






**రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి లక్ష్యమని తెలిపారు. ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. విభాగాల వారీగా చూస్తే రెవెన్యూ శాఖకు 24, ఇతర శాఖలకు 65 ఫిర్యాదులు వచ్చి మొత్తం 89 దరఖాస్తులు నమోదయ్యాయి. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి మాట్లాడుతూ రైతు వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలని అధికారులకు సూచించారు. అలాగే జనగణన--2027 స్వీయ గణన కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపా

# ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కిడ్నాప్.. గన్‌తో బెదిరించి రూ. 1.8 కోట్లు బదిలీ!

**ఢిల్లీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్‌ను కిడ్నాప్ చేసిన ఫ్రాంచైజీ భాగస్వామి**

**అరుపులు బయటకు వినిపించకుండా ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం**

**బాధితురాలికి గంటలపాటు నరకం చూపిన నిందితులు**

**డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన పోలీసులు**

**ఆసుపత్రి బెడ్‌పై నిందితుడి అరెస్ట్**





వ్యాపార భాగస్వామే కాలయముడయ్యాడు. నమ్మించి పిలిపించి, కిడ్నాప్ చేసి, కణతకు తుపాకీ గురిపెట్టి గంటలపాటు నరకం చూపించాడు. బలవంతంగా రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. భోపాల్‌లో జరిగిన ఈ సంచలన ఘటన, ఏ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌కూ తీసిపోని రీతిలో సాగింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్‌కు ఎదురైన ఈ భయానక అనుభవం దేశవ్యాప్తంగా కలకలం రేపింది.ఢిల్లీ కేంద్రంగా పనిచేసే 'శుభ్రా రంజన్ ఐఏఎస్ అకాడమీ' డైరెక్టర్ శుభ్రా రంజన్‌ను, అదే అకాడమీకి భోపాల్‌లో ఫ్రాంచైజీ నడుపుతున్న ప్రియాంక్ శర్మ మోసపూరితంగా భోపాల్‌కు ఆహ్వానించాడు. నగరంలో మరో సెంటర్ ప్రారంభించాలని, సెమినార్ నిర్వహించాలని నమ్మబలికాడు. ఇది నిజమేనని నమ్మి ఆమె భోపాల్ వచ్చారు. బుధవారం మధ్యాహ్నం 2-3 గంటల సమయంలో, ఆమె బస చేస్తున్న 5-స్టార్ హోటల్ నుంచి ప్రియాంక్ ఆమెను తన కారులో ఎక్కించుకుని బాగ్‌సేవానియా ప్రాంతంలోని ఓ అద్దె ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు.అప్పటికే అక్కడ ప్రియాంక్ ఏర్పాటు చేసిన సాయుధులైన వ్యక్తులు కాపు కాశారు. ఫ్లాట్‌లోకి వెళ్లగానే శుభ్రా రంజన్, ఆమె సహాయకులను బంధించారు. దాదాపు నాలుగు గంటల పాటు తుపాకీతో బెదిరిస్తూ, 'జనక్షిలా సొసైటీ', 'ఆర్ఎస్ ఎంటర్‌ప్రైజెస్' పేర్లతో ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. వారి అరుపులు, కేకలు బయటకు వినిపించకుండా ఉండేందుకు నిందితులు అదే ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం ఏర్పాటు చేయడం గమనార్హం. ఇది భక్తితో చేసింది కాదని, బాధితురాలి గొంతును అణచివేసేందుకే ఈ నాటకం ఆడారని పోలీసులు తెలిపారు.అంతేకాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా భయపెట్టేందుకు ఓ నకిలీ వీడియోను కూడా రికార్డ్ చేశారు. అందులో ఓ వ్యక్తిని తాళ్లతో కట్టి బాక్సులో బంధించినట్లు చూపించి, ఫిర్యాదు చేస్తే తమ సహచరులకు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.డబ్బు బదిలీ పూర్తయ్యాక బుధవారం రాత్రి బాధితులను విడిచిపెట్టారు. వెంటనే బాధితుల తరపున సంతోష్ కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భోపాల్ క్రైమ్ బ్రాంచ్ రంగంలోకి దిగింది. పోలీస్ కమిషనర్ సంజయ్ కుమార్ సింగ్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. గంటల వ్యవధిలోనే స్పందించిన పోలీసులు, నిందితులు డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. దీంతో రూ.1.89 కోట్ల మొత్తం భద్రంగా ఉంది.మరోవైపు, అరెస్ట్ తప్పదని భావించిన ప్రధాన నిందితుడు ప్రియాంక్ శర్మ విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించాడు. అది విఫలమవడంతో, తీవ్ర అనారోగ్యం నటిస్తూ భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలోని ఐసీయూలో చేరాడు. అయితే, పక్కా సమాచారంతో అక్కడికి చేరుకున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, వైద్యులను సంప్రదించి అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని నిర్ధారించుకుని, ఆస్పత్రి బెడ్‌పైనే అతడిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో ప్రియాంక్ తల్లి, భార్య పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.ప్రియాంక్ విచారణ అనంతరం మరో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిని కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ నేరంలో ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్, తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రియాంక్ భార్య పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. దోపిడీకి గురైన డబ్బును తిరిగి బాధితురాలికి అప్పగించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.

# రాయచోటిలో వైసీపీ నేతపై హత్యాయత్నం.. మంత్రి అనుచరుల పనేనని ఆరోపణ

**రాయచోటిలో వైసీపీ నేత దశరథరామిరెడ్డిపై హత్యాయత్నం**

**భూవివాదం నేపథ్యంలో కత్తులు, రాడ్లతో దాడి చేసిన ప్రత్యర్థులు**

**మంత్రి మండిపల్లి అనుచరుల పనేనని వైసీపీ ఆరోపణ**

**బాధితుడికి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స, పరిస్థితి విషమం**

**రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని వైసీపీ నేతల ఆగ్రహం**







అన్నమయ్య జిల్లా రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నేత, రాయచోటి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పి. దశరథరామిరెడ్డిపై నిన్న హత్యాయత్నం జరిగింది. భూవివాదం నేపథ్యంలో ప్రత్యర్థులు కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ దాడి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అనుచరుల పనేనని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే, దశరథరామిరెడ్డికి చెందిన కల్యాణమండపం సమీపంలోని ఓ స్థలంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయంపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ, ఆదివారం సుమారు 100 మంది ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు వివాదాస్పద స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నించారు. దీనిని ప్రశ్నించిన దశరథరామిరెడ్డిపై వారు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దశరథరామిరెడ్డితో పాటు ఆయన అనుచరులు జాకీర్, దేరంగుల ఆంజనేయులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. దాడి చేసిన వారు కల్యాణమండపాన్ని, ఆయన వాహనాన్ని ధ్వంసం చేసినట్లు బాధితులు తెలిపారు.ఈ ఘటనపై వైసీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి భూమన కరుణాకర్ రెడ్డి పరామర్శించారు. దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని మిథున్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని భూమన విమర్శించారు. ఈ ఘటనతో రాయచోటిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు బాధితుడి నుంచి వాంగ్మూలం స్వీకరించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య



## ఇలా చేస్తే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు!




నడక.. ఆరోగ్యానికి దివ్యౌషధం! అత్యంత ప్రభావశీలమైన వ్యాయామం! అయితే, మామూలుగా నడిచేకన్నా.. వెనక్కి నడవడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని అంటున్నారు నిపుణులు. సాధారణంగా వాకింగ్ చేసేటప్పుడు.. శక్తి అనేది చీలమండ నుంచి పుడుతుంది. అదే.. వెనక్కి నడిచే సమయంలో తుంటి, మోకాళ్ల నుంచి శక్తి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మార్పు శరీరంలో అనేక ప్రయోజనాలను అందిస్తుందని అంటున్నారు. వెనక్కి నడవడం వల్ల నడకలో సమతుల్యత, వేగం మెరుగుపడుతుంది. రివర్స్ వాకింగ్.. కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుస్తుందట. అంటే, వ్యాయామం చేసేటప్పుడు గుండె, ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను మరింత ఎక్కువగా గ్రహించడానికి తోడ్పాటు అందిస్తుంది. రివర్స్‌లో నడవడం వల్ల మోకీలు, మోకాళ్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఇక రోజూ వ్యాయామం చేసేటప్పుడు 10 15 నిమిషాలు వెనక్కి నడిస్తే.. ఎముకలు దృఢంగా తయారవుతాయట. బోలు ఎముకల వ్యాధి బారినుంచి తప్పించుకోవచ్చుట. మామూలు వాకింగ్‌తో పోలిస్తే.. వెనక్కి నడవడం వల్ల కొలెస్ట్రాల్ ఎక్కువ మొత్తంలో కరుగుతుందట. రివర్స్ వాకింగ్.. మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతుంది. అందుకే, పిల్లలకూ ఇలా వెనక్కి నడవడం నేర్పించాలనీ, దానివల్ల వారి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. వారి ఆలోచన విధానంలో మార్పులు వస్తాయని చెబుతున్నారు. అయితే, మొదట్లో వెనక్కి నడవడం కష్టంగానే ఉంటుంది. రోజూ 10 %-% 15 అడుగులు వెనక్కి నడుస్తూ.. ఆ తర్వాత పెంచుకుంటూపోతే అలవాటు అవుతుంది.

## సూప్‌లతో ఫ్లూ తగ్గుతుందా?



చలికాలంలో గొంతుకు, పొట్టకు హాయిగా ఉంటుందని చాలామంది సూప్‌లను తీసుకోవడానికి ఇష్టపడుతుంటారు. అయితే వేడివేడిగా కడుపులోకి జారే ఈ సూప్‌లు ఆరోగ్యానికి ఏమైనా మేలు చేస్తాయంటారా? అసలు సూప్‌లో ఏముంటుంది? చలికాలంలో సూప్‌లు తాగడం అన్నది కేవలం హాయినిచ్చే అంశమే కాదు, ఆరోగ్యాన్నీ అందిస్తుంది. వాతావరణం చల్లగా ఉండే ఈ సమయంలో జీవక్రియ మందగించి పెద్దగా ఆకలివేయదు. అలాంటప్పుడు సూప్ తాగడం ద్వారా సులభంగా పొట్ట నిండటంతోపాటు ఆకలి కూడా పెరుగుతుంది. దీనివల్ల మరింత ఆహారాన్ని తీసుకోగలం. వేడి వేడిగా ద్రవ రూపంలో ఉండే ఈ సూప్‌లు జీర్ణ వ్యవస్థను చురుగ్గా పనిచేసేలా చేస్తాయి. అంతేకాదు, రకరకాల కూరగాయలతో చేసే ఈ ద్రవాలలో పీచులు ఎక్కువ. తిన్నది బాగా అరిగేందుకు, విసర్జక వ్యవస్థ పనితీరు మెరుగుపడేందుకు ఇవి సాయపడతాయి. విభిన్న రకాల ఆకుకూరలు, కూరగాయల మిశ్రమంగా తయారయ్యే సూప్‌లలో ప్రొటీన్, విటమిన్-సి, డి, జింక్, బీటా కెరొటిన్‌లాంటి పోషకాలెన్నో ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి శ్లేష్మం అధికంగా ఏర్పడకుండా సాయపడతాయి. జలుబులాంటి ఫ్లూలు అధికంగా వచ్చే సమయంలో వివిధ విటమిన్లు, మినరళ్లు, సూక్ష్మ పోషకాల సమాహారం అయిన సూప్‌లు తాగడం వల్ల వాటి నుంచి రక్షణ పొందొచ్చు. బోన్ బ్రాత్ ఆధారిత సూప్‌లు తాగడం వల్ల ఎముకలకు బలాన్నిచ్చే కాల్షియం, మెగ్నీషియంలాంటి ఖనిజ లవణాలు లభిస్తాయి. అలాగే సూప్‌లకు పనీర్, సోయాబీన్, శనగలు, పెసర్లు లాంటివి జోడించడం వల్ల అందులో ప్రొటీన్ కూడా చేరుతుంది. దీంతో ఇది శరీరానికి మరింత బలమైన ఆహారంగా మారుతుంది. చికెన్‌ను జోడించినా మాంసకృత్తులు అధికంగా శరీరానికి అందుతాయి. దాల్చిన చెక్క, ఆకు, మిరియాల పొడిలాంటి దినుసులు దీనికి సుగంధంతోపాటు మరిన్ని సుగుణాలను జోడిస్తాయి. అల్లం, వెల్లుల్లిలాంటివీ ఉండటంతో రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. ఇక, ఆరోగ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి సూప్‌లు మంచి ఎంపిక. మొత్తంగా, చలికాలానికి సూప్‌లు ఆరోగ్యపు దుప్పటి లాంటివి అన్నమాట!

## చీమల దండు నేర్పే ట్రాఫిక్ పాఠాలు!



చీమలకూ ట్రాఫిక్ సెన్స్ ఉంటుందని, అవి సమన్వయంతో, తెలివిగా ప్రయాణిస్తాయని ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ ట్రెన్టోకు చెందిన పరిశోధకులు గుర్తించారు. ప్రొఫెసర్లు మార్కో గెరియ్యేరి, నికోలా పుగ్నో నేతృత్వంలో చీమలదండు ప్రయాణంపై నిర్వహించిన అధ్యయనం వివరాలు 'ట్రాన్స్‌పోర్టేషన్ రిసెర్చ్ ఇంటర్‌డిసిప్లీనరీ పెర్స్‌పెక్టివ్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. డీప్ లెర్నింగ్ ద్వారా చీమల ప్రయాణతీరును గమనించారు. ప్రయాణంలో చీమలు ప్లాటూన్‌గా ఏర్పడటం వంటి అనేక వ్యూహాలు పాటిస్తాయని, ఒకే వేగంతో వెళ్తాయని పరిశోధకులు గుర్తించారు. ఎంత రద్దీ ఉన్నా జామ్‌లు కానివ్వవని, ఓవర్‌టెక్ చేయవని తేల్చారు. మన రోడ్లపై వాహనాలు వెళ్లినట్టుగానే చీమలు సైతం ఇరు దిశల్లో ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. జామ్‌లను నివారించేందుకు చీమలు అనుసరిస్తున్న పద్ధతులను పట్టణాల్లో ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగించవచ్చని పరిశోధకులు సూచించారు. సెల్ఫ్ డ్రైవ్ వాహనాల తయారీలో చీమల ప్రయాణ వ్యూహాన్ని జోడించి సవాళ్లను అధిగమించొచ్చని పేర్కొన్నారు.

## సింగిల్ డోస్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్!



రొమ్ము క్యాన్సర్ చికిత్స కాలాన్ని గణనీయంగా తగ్గించే కొత్త కృత్రిమ అణువును అమెరికన్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయిస్‌కు చెందిన పరిశోధకులు తయారు చేసిన ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవై అనే కృత్రిమ అణువుకు సంబంధించిన వివరాలు అమెరికన్ కెమికల్ సొసైటీ ప్రచురించే ఏసీఎస్ సెంట్రల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈస్ట్రోజెన్ రెసెప్టార్ పాజిటివ్(ఈఆర్ పాజిటీవ్) బ్రెస్ట్ క్యాన్సర్ బాధితుల చికిత్సకు ఈ కృత్రిమ అణువును వినియోగించవచ్చని, ఒకే డోస్‌తో ఇది చిన్న క్యాన్సర్ కణతులను అంతమొందిస్తుందని, పెద్ద కణుతులను తగ్గిస్తుందని పరిశోధకుడు పాల్ హెర్జెన్‌రోథర్ తెలిపారు. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో దాదాపు 70 శాతం మందికి ఈఆర్ పాజిటివ్ క్యాన్సర్ ఉంటుందని అంచనా. వీరికి శస్త్రచికిత్స చేసిన తర్వాత దాదాపు 5 -10 ఏండ్ల పాటు హార్మోన్ థెరపీ అందించాలి.

### సైడ్ ఎఫెక్ట్స్ సమస్య లేకుండా..

ఇలా ఎక్కువకాలం హార్మోన్ థెరపీ చేయడం వల్ల రక్తం గడ్డకట్టడం, కండరాల నొప్పి, లైంగిక సమస్యలు, అలసట వంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వీటి వల్ల 20-30 శాతం మంది రోగులు మధ్యలోనే చికిత్సను వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ కణాలను అంతం చేసేందుకు 2021లో పాల్ హెర్జెన్‌రోథర్ బృందం ఈఆర్ఎస్ఓ అనే కృత్రిమ అణువును తయారు చేసింది. అయితే,దీనితోనూ సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ ఉండటంతో పలు మార్పులు చేసి ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవైను తయారుచేశారు. ఎలుకలకు ఒకే డోస్ ఇవ్వగా చిన్న కణతులు అంతమయ్యాయి. పెద్ద కణతులు కూడా క్షీణించాయి. మనుషులపై దీని ప్రభావాన్ని తెలుసుకునేందుకు మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని పరిశోధకులు తెలిపారు.

# రక్తహీనత సమస్య ఉందా వీటిని తింటే రక్తం ఎక్కువగా తయారవుతుంది

ప్రస్తుతం చాలా మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రక్తహీనత వచ్చేందుకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. పోషకాలు లేని ఆహారాన్ని తింటున్నందునే చాలా మందిలో రక్తం తగినంతగా ఉండడం లేదని వారు అంటున్నారు. ముఖ్యంగా ఐరన్ లోపం సమస్య చాలా మందికి వస్తోంది. అలాగే ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం అయ్యే విటమిన్ బి12 కూడా చాలా మందిలో లోపిస్తోంది. ఇది కూడా రక్తహీనతకు కారణం అవుతోంది. ఈ క్రమంలోనే కేవలం ఐరన్ మాత్రమే కాకుండా విటమిన్ బి12 ఉండే ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక రక్తహీనత తగ్గాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### జున్ను, బ్రౌన్ రైస్..

జున్ను నుంచి మనకు విటమిన్ బి12 పుష్కలంగా లభిస్తుంది. కనుక జున్ను పాలు లభించే అసలు విడిచిపెట్టకుండా తీసుకోండి. జున్నును విటమిన్ బి12కు గొప్ప వనరుగా చెప్పవచ్చు. అదేవిధంగా పాలు, పనీర్‌తోపాటు ఇతర పాల ఉత్పత్తుల్లోనూ విటమిన్ బి12 అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌ను ఎక్కువగా తినాలి. బ్రౌన్ రైస్‌లోనూ మనకు విటమిన్ బి12 సమృద్ధిగానే లభిస్తుంది. ప్రస్తుతం చాలా మంది తెల్ల అన్నాన్ని ఎక్కువగా తింటున్నారు. దీన్ని తినడం వల్ల బరువు పెరగడంతోపాటు డయాబెటిస్ బారిన కూడా పడుతున్నారు. కనుక బ్రౌన్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ బి12 రక్తం తయారయ్యేందుకు దోహదపడుతుంది. అలాగే పలు ఇతర పోషకాలు కూడా మనకు లభిస్తాయి.

### పాలకూర జ్యూస్..

రక్తహీనత అధికంగా ఉన్నవారు రోజూ పాలకూరతో జ్యూస్



తయారు చేసి 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తుంటే కచ్చితంగా ఫలితం ఉంటుంది. పాలకూర ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తకణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అదేవిధంగా బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా రక్తహీనత నుంచి బయట పడవచ్చు. బీట్‌రూట్‌లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. అలాగే దీని ద్వారా ఐరన్ కూడా మనకు ఎక్కువగానే లభిస్తుంది. కనుక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగుతుంటే రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

### దానిమ్మ పండ్లు..

దానిమ్మ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటే రక్తం అధికంగా తయారవుతుంది. లేదా ఈ పండ్ల జ్యూస్‌ను అయినా సరే రోజుకు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఈ పండ్లను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా సైతం మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ గుప్పెడు కరివేపాకులను దంచి ఆ మిశ్రమాన్ని మజ్జిగలో కలిపి తీసుకుంటుండాలి. దీంతో రక్తాన్ని పెంచుకోవచ్చు. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తయారయ్యేలా చేసేందుకు గాను తోటకూర కూడా ఎంతగానో పనిచేస్తుంది. తోటకూరతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగవచ్చు. లేదా తోటకూరను కూరగా వండుకుని తింటుండాలి. దీంతో రక్తం తయారవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల విటమిన్ బి12 ఇంకా ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడతారు.

# తాటిబెల్లంలో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు రోజూ తినాల్సిందే



మన చుట్టూ ఉండే ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మంది మాత్రం రోజూ అనారోగ్యకరమైన ఆహారాలనే తింటున్నారు. బేకరీ పదార్థాలు, జంక్ ఫుడ్, నూనె పదార్థాలు, స్వీట్లను ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల రోగాల బారిన పడుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక ప్రకృతి మనకు అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాల్లో తాటి బెల్లం కూడా ఒకటి. దీన్ని మనం రహదారుల పక్కన చూడవచ్చు. చాలా మంది తాటిబెల్లాన్ని విక్రయిస్తుంటారు. అయితే తాటి బెల్లంను అది ఉన్న రంగు కారణంగా చాలా మంది ఇష్ట పడరు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తాటి బెల్లంను ఇప్పుడే తినడం మొదలు పెడతారు. అన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇది అందిస్తుంది.

### రక్తహీనతకు ఔషధం..

తాటిబెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో రక్తం ఎక్కువగా తయారవుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి తాటిబెల్లం చక్కని ఆప్షన్ అని చెప్పవచ్చు. రోజువారి ఆహారంలో తాటిబెల్లాన్ని తింటుంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే ఇందులో మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా నరాల బలహీనత తగ్గుతుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తాటిబెల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. దీంతో కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు పట్టుకుపోకుండా చూసుకోవచ్చు.


### ఎముకల ఆరోగ్యానికి..

తాటిబెల్లంలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో ఎముకలు బలంగా మారుతాయి. తాటిబెల్లంలో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. కనుక హైబీపీ ఉన్నవారికి తాటిబెల్లం ఒక వరం అనే చెప్పవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. తాటిబెల్లాన్ని మహిళలు తినడం వల్ల నెలసరి సమయంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో దెబ్బ తిన్న కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో స్త్రీలలో వచ్చే సమస్యలు తగ్గుతాయి.

### జీర్ణ సమస్యలకు..

తాటిబెల్లంలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మలబద్దకం, అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపుతుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడి క్యాన్సర్‌ను నివారించే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. అలాగే తాటిబెల్లంను తింటే పొడి దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక టీస్పూన్ తాటిబెల్లం తినడం వల్ల మైగ్రెయిన్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అధిక బరువును తగ్గించేందుకు ఈ బెల్లం ఎంతగానో పనిచేస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు. కనుక తాటి బెల్లం మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా కొని తెచ్చి వాడండి. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఉన్నది ఒకటే జిందగీ



సంపాదించడం తెలిసినవాళ్లకు ఖర్చు చేయడంపై కూడా అవగాహన ఉండాలి. లేకపోతే ఆదాయం పేరుకుపోతుంది కానీ, ఆనందం మీకు చిక్కకుండా ఎక్కడో కూరుకుపోతుంది! పొదుపు చేసిన సొమ్ము, మదుపు చేసిన మొత్తం మీ ముందుతరాలకు ఇచ్చేస్తే.. మీ తలరాతకు పరులు కూడా జాలిపడే పరిస్థితి వస్తుంది. జీవిత చరమాంకంలో అయినా, ఖుషీ చేయకపోతే ఎలా? ఉన్నది ఒక్కటే జిందగీ! మీ లైఫ్ సుఖాంతం కావాలంటే.. సంపాదించింది ప్లాన్డ్‌గా ఖర్చు చేయడమే మార్గం! ప్రతి మనిషి జీవితం గందరగోళంగానే మొదలవుతుంది. తల్లి కడుపు నుంచి బయటపడగానే ఏడ్చేస్తాం. అది ప్రకృతి ధర్మం కాబట్టి%ౌ% తెలియకపోయినా పాటిస్తాం. ఆకలి కాగానే తల్లిపాలు తాగుతాం. అది సృష్టివింత కాబట్టి.. తెలియకుండానే చేసేస్తాం. పెరిగి పెద్దయ్యేకొద్దీ మనలో ఆలోచనలు మొదలవుతాయి. చేయాల్సింది చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాం. చేయకూడనివి చేయాలని తాపత్రయపడతాం. అలా తప్పుల మీద తప్పులు చేస్తూ పెరిగి పెద్దవుతాం. ఏళ్లొచ్చాక ఎక్కడ తప్పు చేసినా చెల్లుతుందేమో కానీ, ఆర్థిక విషయాల్లో పొరపాట్లకు తావిస్తే, జీవితం గ్రహపాటుగా మిగిలిపోతుంది. సంపాదించడం చేతకాని వాళ్లు తప్పు చేసే ఆస్కారం ఉండదు. దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఇతరుల అదృష్టంపై ఏడుస్తూ భారంగా కాలం వెళ్లదీస్తుంటారు. వీళ్లను బాగు చేయడం ఎవరి తరమూ కాదు! కానీ, బాధ్యతగా బతుకుతూ, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, కష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఒకస్థాయికి చేరుకుంటారు కొందరు. ఈ క్రమంలో కోరికలు చంపుకుంటారు, కష్టాలకు ఎదురీదుతారు, రూపాయి రూపాయి పోగు చేసి సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకుంటారు. జీవితం అంతా కుటుంబం కోసం పనిచేసిన ఈ వ్యక్తులు.. తమకంటూ ఓ లైఫ్ ఉందని అర్థం చేసుకోరు. అలా అర్థం చేసుకున్నవాళ్లు.. ఇదిగో ఈ పార్థసారథి గారిలా జిందగీని ముచ్చటగా ఎంజాయ్ చేస్తారు.

అందుకు ఆయనేం కోట్లు ఖర్చు చేయలేదు. ఒక్కటంటే ఒక్క కోటి రూపాయలు పదిలం చేశాడు. పార్థసారథి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసేవాడు. పిల్లలను బాగా చదివించాడు. సర్వీసులో ఉన్నప్పుడే పిల్లల పెళ్లిళ్లూ అయిపోయాయి. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కూతురు, అల్లుడూ బ్యాంకులో పనిచేస్తారు. రెండేండ్ల కిందట రిటైర్ అయ్యాడు. శేష జీవితం మనవలు, మనవరాళ్లతో ఎంజాయ్ చేయాలని ఫిక్సయ్యాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ కలిపితే రూ.కోటి దాకా వచ్చాయి. ఈ మొత్తాన్ని ఏం చేయాలో పార్థసారథికి అర్థం కాలేదు. అప్పటికే ఇల్లు ఉంది. ఒకటి రెండు ఆస్తులున్నాయి. పిల్లలకు తండ్రి సొమ్ము కావాలన్న ఆశ లేదు. 'ఈ కోటి ఏం చేయాలంటూ?' నా సలహా అడిగారు. జీవితం అంతా కష్టపడిన ఆయన్ను 'ఈ కోటి రూపాయలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారా?' అని అడిగాను. ముందు కంగారుగా చూసినా.. తర్వాత తేరుకొని 'ఓ ఎస్' అన్నారు. ఈ కోటి రూపాయలను కరిగించకుండా.. జీవితాన్ని ఎంజాయ్ చేసే మార్గం ఉందని చెప్పడంతో.. ఆశ్చర్యంగా చూశారు. ఆ కోటి రూపాయలూ హైబ్రిడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమని చెప్పాను. ఏటా మే 1వ తేదీన ఆ కోటిపై వచ్చే రిటర్న్స్ మొత్తాన్నీ రూపాయి మిగల్చకుండా విత్‌డ్రా చేసి, ఖర్చు చేయాలనే షరతును ఆయన అంగీకరించారు. అలా ఏడాది (2023-24) తిరిగే సరికి ఆ కోటి రూపాయలపై అచ్చంగా రూ.30 లక్షల రిటర్న్స్ వచ్చింది (మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ ఒడుదొడుకులకు లోబడి ఉంటాయి. అన్నిసార్లూ ఇలా రూ.30 లక్షలు వస్తాయన్న గ్యారెంటీ లేదు. కొన్నిసార్లు తక్కువ రావొచ్చు, అసలేం రాకపోవచ్చు కూడా! అయినా ఈ సొమ్ము వెకేషన్ నిమిత్తం కాబట్టి రాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దీని మీద ఆధారపడి లేరు కదా!). అంత పెద్ద అమౌంట్‌ను ఏం చేయాలని మళ్లీ అడిగారు. ఫ్యామిలీతో ఇంటర్నేషనల్ వెకేషన్‌కి వెళ్లమని చెప్పాను. కుటుంబంతో పదిరోజులు రెండు దేశాలు చుట్టొచ్చారు పార్థసారథి. అప్పటికీ రూ.30 లక్షల్లో సగమే ఖర్చయ్యాయి. 'దీన్ని ఏం చేయమంటారు?' అని మళ్లీ సలహా కోరారు. 'కొడుకు, కోడలు, కూతురు, అల్లుడిని పిల్లలతో సహా డిన్నర్‌కు పిలిచి, ఇకపై నేను ఉన్నంత వరకు మీ పిల్లల చదువు ఖర్చు ఎంతైనా బాధ్యత నాదేనని' చెప్పమన్నాను! మార్కెట్ క్రాష్ అయినా, దీర్ఘకాలంలో మీ పెట్టుబడి పదిలంగా ఉంటుంది. రిటర్న్స్‌లో కొంత కోత పడుతుందేమో అంతే! తన పూర్తి పరివారంతో ఏడాదికి ఒక దేశం చుట్టేస్తూ జాయ్‌ఫుల్‌గా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు పార్థసారథి. మనవలు, మనవరాళ్లనూ చదివిస్తూ మలిసంధ్యలో భారం అనుకోకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందరికీ ఇంత ఈజీగా సొల్యూషన్ దొరక్కపోవచ్చు. కానీ, విదేశాల్లో 'డై విత్ జీరో' కాన్సెప్ట్ ఎప్పట్నుంచో ఉంది. పోయేలోపు ఉన్నదంతా ఖర్చు చేసి లైఫ్ ఎంజాయ్ చేయడమన్నమాట. అలాగని జల్సాలకే ఖర్చు పెట్టాలన్న నియమం లేదు. నలుగురికీ సాయం చేయొచ్చు. పదిమంది ఆకలి తీర్చొచ్చు. ఇలా మీ కష్టార్జితం మీ ఇష్టం వచ్చినట్టు వెచ్చించడం అన్నమాట! పార్థసారథి కూడా ఈ సూత్రాన్నే ఎంచుకున్నారు. వారసులకు ఇవ్వాల్సింది ఆస్తుల మూటలు కాదు. మంచి భవిష్యత్తు. బుద్ధిమంతులు ఏ ఆస్తీ ఇవ్వకున్నా.. హాయిగా బతికేస్తారు. బుద్ధిహీనులకు ఏడు తరాలకు సరిపడా ఆస్తి ఇచ్చినా ఊడ్చిపడేస్తారు. సో, మీ కష్టార్జితాన్ని ఎలా వినియోగిస్తారో ఇక మీ ఇష్టం!!



## యశ్‌తో బోల్డ్ సీన్స్.. తొలగించాలంటూ హీరోయిన్ రిక్వెస్ట్!

కేజీయఫ్ 2 లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత కన్నడ స్టార్ యశ్ నటించిన పాన్ వరల్డ్ చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చిలోనే విడుదల కావాల్సింది. కానీ చివరి నిమిషంలో జూన్ 4వ తేదికి వాయిదా వేశారు. ఇప్పుడు జూన్‌లో కూడా ఈ చిత్రం విడుదల కావడం లేదు. సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చిందని..ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. సినిమా ప్రమోషన్స్ కోసమే వాయిదా వేస్తున్నట్లు యశ్ ప్రకటించారు. కొత్త తేదిని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ గాసిప్ నెట్టింట వైరల్ అవుతుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. చిత్రబృందానికి వింత విజ్ఞప్తి చేసిందట. షూటింగ్ సమయంలో కథ డిమాండ్ మేరకు యశ్, కియారాల మధ్య కొన్ని బోల్డ్ సీన్లు చిత్రీకరించారట. ఇలాంటి సన్నివేశాలు ఉంటాయని కియారాకి ముందే చెప్పారట. ఆమె అన్నింటికి ఒప్పుకొనే సినిమాకు సైన్ చేసిందట. ఇష్టంతోనే బోల్డ్ సీన్లు చేసినప్పటికీ.. ఫైనల్ కట్ చూసి ఇప్పుడు ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. బోల్డ్ సీన్లు తెరపై మరింత ఘటూగా ఉన్నాయని..వాటిని అలాగే చూపిస్తే తన ఇమేజ్‌పై ప్రభావం పడుతుందని భయపడుతుందట. అందుకే వాటిని తొలగించడా లేదా నిడివి తగ్గించే ప్రయత్నం చేయమని దర్శకురాలికి రిక్వెస్ట్ చేసినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే ఆయా సన్నివేశాలు కథకి చాలా కీలకమని..వాటిని తొలగిస్తే సినిమాలోని భావోద్వేగ తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారట. మరి కియారా రిక్వెస్ట్ మేరకు ఆ సీన్లను తొలగిస్తారా లేదా అలానే ఉంచుతారా అనేది తెలియాలంటే రిలీజ్ వరకు ఎదురు చూడాల్సిందే.

## గ్లామర్ పాత్రలకు బ్రేక్ .. శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు



టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది. ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించిన శ్రీలీల, "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనుకుంటున్నాను" అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపింది. శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడుతుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూపించాలని ఉన్న ఆమె తపనను అభిమానులు స్వాగతిస్తున్నారు.కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది.

## పూజా కార్యక్రమాలతో మొదలైన గోపీచంద్ కొత్త సినిమా.. వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్!



యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ చిత్రాన్ని ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వెంకట్, ఒక గ్రిప్పింగ్ మరియు రూటెడ్ కథతో ఈ సినిమాను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి టాలీవుడ్ టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. సామ్ సి.ఎస్ (ఝఎ జూ) సంగీతాన్ని అందిస్తుండగా, శామ్‌దత్ ఐఎస్‌సి ఛాయాగ్రహణం బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ 'భరత వర్ష' అనే పీరియడ్ చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది.



## ఓటీటీకి డెకాయిట్ మూవీ..

అడివి శేష్ హీరోగా షానిల్ డియో తెరకెక్కించిన యాక్షన్ మూవీ 'డెకాయిట్'. సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఇక ఈ మూవీని ఏప్రిల్ 10న రిలీజ్ చేశారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పరంగా ?అదరగొట్టింది. తొలిరోజే రూ. 15 కోట్లతో రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాకుండా కేవలం మూడు రోజుల్లోనే రూ.34.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. ?అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సినిమా అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీ తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. కాగా.. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు.

## బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్.. కానీ ప్రియుడి పేరు మాత్రం సీక్రెట్‌గానే..!



భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్- అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. "అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను" అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. "ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది. అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. "పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అనిపిస్తోంది" అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు. మొత్తానికి, గత ప్రేమ విఫలమైనా ముందుకు సాగుతూ కొత్త జీవితాన్ని ఆహ్వానిస్తున్న అక్షరా సింగ్ నిర్ణయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ అమ్మడు తన లవ్‌కి సంబంధించిన పూర్తి విషయాలు ఎప్పుడు బయట పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ 'భరతనాట్యం 2: మోహినియాట్టం'



మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్ధలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. క్రైమ్ కామెడీ మరియు ఫ్యామిలీ డ్రామా కలయికతో రూపొందిన ఈ మూవీ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.